సాక్షి
కరీంనగర్
బుధవారం । 17 । ఏప్రిల్ । 2024

రాజన్న సన్నిధిలో రామన్న పెళ్లి

రాజన్న సన్నిధిలో బుధవారం ఉదయం 11.55 గంటలకు శ్రీసీతారాముల కల్యాణోత్సవానికి ఆలయ అధికారులు సర్వం సిద్ధం చేశారు. మంగళవారం మధ్యాహ్నం నుంచే లక్షలాదిగా భక్తులు వేములవాడకు చేరుకుంటున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం శివపార్వతులతో కిక్కిరిసి పోయింది. శివపార్వతుల పూనకాలు, హిజ్రాల నృత్యాలతో సందడిగా మారింది.

– వేములవాడ





న్యూస్‌రీల్

లోకానికి దిక్సూచి రామాయణం



ప్రవచనం చేస్తున్న చిన జీయర్‌స్వామి

కరీంనగర్ కల్చరల్: రామాయణం లోకానికి దిక్సూచి వంటిదని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్‌స్వామి అన్నారు. వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జెట్, వికాస తరంగిణి ఆధ్వర్యంలో పద్మనాయక కల్యాణమంపంలో నిర్వహిస్తున్న శ్రీమద్రామాయణ ప్రవచనంలో మంగళవారం ఉదయం, సాయంత్రం స్వామిజీ ప్రవచనం చేశారు. త్రేతాయుగ పురుషుడైన రాముడు నారాయణుని అంశతో మానవుడిగా జన్మించి లోక నీతిని, రీతిని తెలియజెప్పాడన్నారు. రామాయణాన్ని చదివితే ఎన్నో విలువైన విషయాలు తెలుస్తాయని, వాటిని ఆచరించాలని సూచించారు. కనీసం రామాయణం వినడం, పారాయణం చేయించుకోవడం ద్వారా సకల శుభాలు కలుగుతాయన్నారు. ఉదయం శ్రీమద్రామాయణ హవనం, పూర్ణాహుతి, మధ్యాహ్నం అన్నదానం జరిగింది. చల్మెడ లక్ష్మీనరసింహారావు, కె.గౌతమరావు, బీవీ రావు, ఎస్.వెంకటేశం, ఎల్.భూపతిరావు, యాద కిషన్, కె.వరప్రసాదాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామికి పూజలు

రామడుగు(చొప్పదండి): రామడుగు మండలం వెలిచాల గ్రామంలోని స్వయంభూస్తంభ లక్ష్మీనరసింహస్వామిని మంగళవారం చిన జీయర్‌స్వామి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు మంగళశాసనాలను అందజేశారు. ఆలయాభివృద్ధి కమిటీ చైర్మన్ వీర్ల ప్రభాకర్‌రావు, సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు, మాజీ జెడ్పీటీసీ వీర్ల కవిత, మాజీ సర్పంచ్ వీర్ల సరోజన, అర్చకులు రామానుజం, కిరణ్ పాల్గొన్నారు.

మంత్రి నివాసంలో సీతారాములకు ఎదుర్కోలు



పూజలు నిర్వహిస్తున్న మంత్రి దంపతులు

కరీంనగర్ కల్చరల్: శ్రీరామనవమి సందర్భంగా నగరంలోని సప్తగిరికాలనీ కోదండా రామాలయంలోని సీతారాముల ఉత్సవమూర్తులకు మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో ఎదుర్కోలు వేడుక ఘనంగా నిర్వహించారు. మంత్రితో పాటు కుటుంబసభ్యులు వేదమంత్రాల మధ్య స్వామివారలకు ఎదుర్కోలు శాస్త్రోక్తంగా జరిపారు. మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున రాజేందర్, ఆకారపు భాస్కర్‌రెడ్డి, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, కటకం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాస్

కరీంనగర్ కార్పొరేషన్: నగర ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ అన్నారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. మంగళవారం బల్దియా కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, ఆస్తి పన్ను వసూలు, కోర్టు కేసులు, ట్రేడ్‌లైసెన్స్‌లు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. తాగునీటి సరఫరాలో ఎక్కడా ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడైనా లీకేజీలు ఏర్పడితే వెంటనే సరిచేయాలని సూచించారు. ఆస్తి పన్నులో ఐదుశాతం రాయితీని ప్రజలు వినియోగించుకునేలా ప్రాచుర్యం కల్పించాలని, లక్ష్యానికి అనుగుణంగా బిల్‌కలెక్టర్లు ఆస్తి పన్ను వసూలు చేయాలన్నారు. నగరంలో వ్యాపారులు ట్రేడ్‌లైసెన్స్ తీసుకునేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్నవి పూర్తి చేసి లైసెన్స్‌లు జారీ చేయాలన్నారు. పట్టణ ప్రణాళిక విభాగానికి చెందిన పెండింగ్ కోర్టు కేసులు ఉంటే హాజరుకావాలని, భవన నిర్మాణ అనుమతులు వేగవంతం చేయాలన్నారు. నగరంలో రోడ్లు, వీధులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్లాస్టిక్ వాడే దుకాణాలను తనిఖీ చేయాలన్నారు. అదనపు కమిషనర్ స్వరూపరాణి, ఈఈలు యాదగిరి, మహేందర్, డీసీపీ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.



తల్లి లక్ష్మి, సోదరి స్రవంతితో సాయికిరణ్



ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు సివిల్స్‌లో మెరిశారు. కరీంనగర్‌కు చెందిన సహన మొదటి ప్రయత్నంలో టార్గెట్ రీచ్‌కాగా... జిల్లాలోని వెలిచాలకు చెందిన బీడీ కార్మికురాలి కొడుకు సాయికిరణ్ రెండోప్రయత్నంలో లక్ష్యం చేరుకున్నారు.

సాయికిరణ్ 27.. సహన 739..

SUCCESS STORIES

- సివిల్స్‌లో మెరిసిన మనోళ్లు
- బీడీలు చుట్టి చదివించిన తల్లి
- పేదరికాన్ని జయించి లక్ష్యం చేరుకున్న సాయికిరణ్
- చేనేత కుటుంబం బిడ్డ కలసాకారం
- మొదటి ప్రయత్నంలోనే టార్గెట్ చేరుకున్న సహన

సాక్షిప్రతినిధి,కరీంనగర్/రామడుగు: ప్రతిభకు పేదరికం అడ్డు కానే కాదని మరోసారి రుజువైంది. తల్లిదండ్రులు కార్మికులైనా తాను కలెక్టర్ కావాలనుకున్న కలను ఎట్టకేలకు నెరవేర్చుకున్నారు.. పేదరికం కారణంగా కొలువు చేయాల్సి రావడం, కోచింగ్ తీసుకోకుండా సొంతంగానే ప్రిపేరయి రెండో ప్రయత్నంలోనే లక్ష్యం చేరుకున్నారు. సివిల్స్ ర్యాంకు సాధించి యువతకు స్ఫూర్తిగా నిలిచిన నందాల సాయికిరణ్ విజయగాథను ఆయన సోదరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ స్రవంతి 'సాక్షి'కి వివరించారు. సాయికిరణ్ స్వగ్రామం రామడుగు మండలంలోని వెలిచాల. తల్లిదండ్రులు లక్ష్మి–కాంతారావు, సోదరి స్రవంతి ఉన్నారు. తండ్రి చేనేత కార్మికుడు, తల్లి బీడీ కార్మికురాలిగా పని చేస్తూ పిల్లల్ని పెంచారు. కుటుంబాన్ని బాగా చూసుకునేందుకు కాంతారావు మహారాష్ట్రలోని భీవండిలో చేనేత కార్మికుడిగా పని చేశారు. సాయికిరణ్ చిన్ననాటి నుంచి చదువులో ముందుండేవారు. ఐదో తరగతి వరకు సరస్వతి పాఠశాలలో చదివారు. ఆయన ప్రతిభను గుర్తించిన ఆ పాఠశాల కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్ కరీంనగర్‌లోని తేజస్విని పాఠశాలలో ఆరో తరగతిలో చేర్పించారు. 2012లో పదోతరగతి, ట్రినిటీ జూనియర్ కళాశాలలో 2014లో ఇంటర్ ఎంపీసీ పూర్తి చేశారు. ఎన్ఐటీ వరంగల్‌లో సీటు సాధించిన సాయికిరణ్ 2018లో ఇంజినీరింగ్ పూర్తి చేయడంతోనే క్యాల్‌కమ్ కంపెనీలో ఉద్యోగం సాధించారు.

తండ్రి మరణించినా.. తల్లి అండతో..

ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతుండగానే సాయికిరణ్ తండ్రి 2016లో కేన్సర్ బారిన పడి మృతిచెందారు. దీంతో తల్లి లక్ష్మి కష్టపడి బీడీలు చుట్టి, తన ఇద్దరు పిల్లలను ఉన్నత చదువులు చదివించారు. కూతురు స్రవంతి బీటెక్ పూర్తి చేసి, ఆర్‌డబ్ల్యూఎస్‌లో ఇంజినీర్‌గా ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలో పని చేస్తున్నారు. సాయికిరణ్ 2018 నుంచి ఉద్యోగం చేస్తూనే ఆన్‌లైన్‌లో సివిల్స్ కోచింగ్ తీసుకుంటూ పరీక్షలకు సిద్ధమయ్యారు. గతేడాది విఫలమైనా రెండోసారి ఆలిండియా 27వ ర్యాంకు సాధించారు. వీరి తల్లి లక్ష్మి ఇప్పటికీ బీడీలు చుడుతుందని గ్రామస్తులు తెలిపారు. కాగా, సివిల్స్ ర్యాంకర్ సాయికిరణ్‌ను ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అభినందిస్తున్నారు.



ప్రత్యేకత చాటుకున్న వెలిచాల..

గత పదేళ్లుగా ఉత్తమ గ్రామపంచాయతీగా పేరు పొందిన వెలిచాలకు ఇక్కడి అభివృద్ధి పనులపై స్టడీ టూర్ చేయడానికి దేశంలోని పలు రాష్ట్రాల నుంచి పలువురు సివిల్ సర్వీస్ ప్రతినిధులు వచ్చి, వెళ్తున్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకున్న సాయికిరణ్ కష్టపడి చదివి, సివిల్స్ ర్యాంకు సాధించడంతో ఈ గ్రామం ప్రత్యేకత చాటుకుంది.



సహనకు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు



ఢిల్లీలో కోచింగ్...

కరీంనగర్‌లోని విద్యానగర్‌కు చెందిన కొలనుపాక గీత–అనిల్ దంపతుల కూతురు సహన సివిల్స్ ఫలితాల్లో 739వ ర్యాంకు సాధించారు. ఆమె స్థానిక కెన్ క్రెస్ట్ స్కూల్లో పదోతరగతి, శ్రీగాయత్రి జూనియర్ కళాశాలలో ఇంటర్, హైదరాబాద్ జేఎన్టీయూలో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. తర్వాత ఢిల్లీలో యూపీఎస్సీ కోచింగ్ తీసుకున్నారు. ప్రిలిమినరీ, మెయిన్స్ ఫలితాల్లో క్వాలిఫై అయ్యాక ఢిల్లీలో పలు మాక్ ఇంటర్వ్యూలకు అటెండయ్యారు. సహన తండ్రి అనిల్ కరీంనగర్‌లో పాత్రికేయుడిగా పని చేస్తున్నారు.

స్మితా సబర్వాల్ స్ఫూర్తి..

ఉమ్మడి రాష్ట్రంలో కరీంనగర్ కలెక్టర్‌గా పని చేసిన స్మితా సబర్వాల్ తనకు స్ఫూర్తి అని సహన తెలిపారు. తాను పాఠశాలలో చదువుతున్నపుడు స్మితా మేడంలా కలెక్టర్ అవ్వాలని ఆ రోజుల్లోనే ఫిక్స్ అయ్యానని, ఆ కల నెరవేర్చుకునేందుకు తాను సివిల్స్ రాయాలని నిర్ణయించుకున్నానని పేర్కొన్నారు. దీనికి తల్లిదండ్రులు ఎంతగానో సహకరించారన్నారు. పేదలకు సేవ చేయాలన్న సంకల్పంతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు.

సిటీ కాంగ్రెస్‌లో మరో లొల్లి

కరీంనగర్ కార్పొరేషన్: కాంగ్రెస్ పార్టీలో మరో పంచాయితీ మొదలైంది. అసెంబ్లీ ఎన్నికల నాటి నుంచి మొదలైన వర్గపోరు, లోక్‌సభ ఎన్నికల వేళ మరింత తీవ్రంగా మారుతోంది. నగరానికి చెందిన 19వ డివిజన్ పార్టీ ఇన్‌చార్జి నియామకం తాజా పంచాయితీకి కారణమైంది. నగరంలోని రేకుర్తికి చెందిన పర్వతం మల్లేశంను 19వ డివిజన్ పార్టీ ఇన్‌చార్జిగా నియమిస్తూ నియోజకవర్గ ఇన్‌చార్జి హోదాలో పురుమల్ల శ్రీనివాస్ ఈ నెల 15న ఉత్తర్వులు జారీ చేశారు. అయితే అప్పటికే డివిజన్ అధ్యక్షుడిగా ఉన్న ఆస్తపురం రమేశ్ దీనిపై అభ్యంతరం వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. తాను డివిజన్ అధ్యక్షుడిగా ఉన్నానని తనకు, కాంగ్రెస్ నగర అధ్యక్షుడికి సంబంధం లేకుండా పురుమల్ల శ్రీనివాస్ 4 నెలల క్రితం పార్టీలోకి వచ్చిన వ్యక్తిని డివిజన్ ఇన్‌చార్జిగా నియమించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పార్టీ నిబంధనలకు విరుద్ధంగా నడిచిన పురుమల్లపై చర్య తీసుకోవాలని, ఆ నియామకాన్ని రద్దు చేయాలని కోరారు. కాగా ఇలాంటి నియామకాలు చెల్లవని మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారని రమేశ్ ఈ సందర్భంగా చెప్పారు. ఇదిలా ఉంటే కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి కాంగ్రెస్‌లో వర్గపోరు రోజురోజుకూ తీవ్రమవుతోంది. లోక్‌సభ ఎన్నికలకు నెల రోజులు కూడా సమయం లేని ప్రస్తుత పరిస్థితుల్లో నియోజకవర్గ కేంద్రమైన కరీంనగర్‌లో తారాస్థాయికి చేరుతున్న వర్గపోరుకు ముగింపు పలకాల్సిన అవసరం పార్టీ నాయకత్వంపై ఉందని క్యాడర్ అభిప్రాయపడుతోంది.

క్వింటాల్ పత్తి రూ. 7,450

జమ్మికుంట: జమ్మికుంట పత్తి మార్కెట్‌లో మంగళవారం క్వింటాల్ పత్తి ధర రూ.7,450 పలికింది. క్రయ విక్రయాలను గుగులోతు రెడ్డి నాయక్ పరిశీలించారు. బుధవారం శ్రీరామనవమి పండుగు సందర్భంగా యార్డుకు సెలవు ప్రకటించినట్లు ఆయన పేర్కొన్నారు.



విద్యుత్ వెలుగుల్లో ఇల్లందకుంట ఆలయం

ముస్తాబైన అపర భద్రాద్రి

ఇల్లందకుంట(హుజూరాబాద్): అపర భద్రాద్రిగా పేరొందిన ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం కల్యాణ వేడుకలకు ముస్తాబైంది. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు సీతారాముల కల్యాణం జరిపించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కలెక్టర్ పమేలా సత్పతి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. నలుగురు ఏసీపీలు, 10 మంది సీఐలు, 15 మంది ఎస్సైలు మొత్తం 200మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా 17న కల్యాణం, 18న పట్టాభిషేకం, 23న సూర్య రథోత్సవం, 24న చంద్ర రథోత్సవం (పెద్దరథం), 25న ఊరేగింపు, 26న పుష్పయాగం, నాఖబలి కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ఈవో సుధాకర్ తెలిపారు.

పార్లమెంట్ ఎన్నికలకు కాంగ్రెస్ సమాయత్తం

- 18 నుంచి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమావేశాలు



కరీంనగర్ కార్పొరేషన్: లోక్‌సభ ఎన్నికలకు ఎట్టకేలకు కాంగ్రెస్ పార్టీ సమాయత్తమైంది. ప్రత్యర్థి పార్టీలు ప్రచారంలో దూసుకుపోతుండగా, అభ్యర్థి ప్రకటనలో జాప్యంతో కాంగ్రెస్ ఇప్పటివరకు ప్రచార పర్వంలోకి దిగలేకపోయింది. ఈ నెల 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలవుతుండడంతో, ఆ రోజు నుంచి నాలుగు రోజుల పాటు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసింది. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, ఒక్కో రోజు రెండు అసెంబ్లీ నియోజకవర్గాలు, చివరిరోజున కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. మంత్రి, పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశాల్లో పార్టీ అభ్యర్థితో పాటు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జీలు, నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్నారు. అభ్యర్థి పరిచయంతో పాటు, ప్రచార కార్యక్రమం కూడా కలిసి వచ్చేలా ఈ సమావేశాలు ఏర్పాటు చేశారు. కాగా ఈ సమావేశాలకు బ్లాక్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ ముఖ్య నేతలు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని రాజన్న సిరిసిల్ల కాంగ్రెస్ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు. 18న ఉదయం 10 గంటలకు మానకొండూరు అసెంబ్లీ నియోజకవర్గ సమావేశం కొత్తపల్లి సాయిరాంగార్డెన్స్‌లో, మధ్యాహ్నం 2 గంటలకు హుజూరాబాద్ నియోజకవర్గ సమావేశం వరంగల్ రోడ్‌లోని సాయిరాంగార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. అలాగే 19న ఉదయం 11 గంటలకు హుస్నాబాద్ శుభం గార్డెన్స్‌లో హుస్నాబాద్ నియోజకవర్గం, మధ్యాహ్నం 2 గంటలకు సిరిసిల్ల నియోజకవర్గ సమావేశాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 20న ఉదయం 10 గంటలకు వేములవాడ నియోజకవర్గం, మధ్యాహ్నం 2 గంటలకు చొప్పదండి నియోజకవర్గం, 21న ఉదయం 10 గంటల నుంచి కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ సమావేశం డీసీసీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి నియోజకవర్గ సమావేశాల వేదికలు త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

మెరుగైన విద్యుత్ సరఫరా చేయండి



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

- టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి



మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా చేయాలని టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్‌లోని విద్యుత్ భవన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఓం అండ్ ఎం ఉద్యోగుల శిక్షణ తరగతులను పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాగా శిక్షణ తరగతులను కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. బిల్లింగ్, రెవెన్యూ కలెక్షన్, విద్యుత్ లైన్ల నిర్వహణ, లోపాల గుర్తింపు, బ్రేక్‌డౌన్స్, ఎర్తింగ్, డీపీఆర్‌ల నిర్వహణ, సబ్‌స్టేషన్ల పర్యవేక్షణ వంటి విద్యుత్ సంబంధిత అంశాలపై మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇచ్చారు. శిక్షణలో భాగంగా ఉద్యోగులతో విద్యుత్ భద్రతల నిబంధనలపై ప్రతిజ్ఞ చేయించారు. డీఈటీ విజయేందర్‌రెడ్డి, డీఈలు రాజం, ఎం.తిరుపతి, చంద్రమౌళి, లక్ష్మారెడ్డి, కాళిదాసు, మాస్టర్ ట్రైనర్లు మల్లేశం, పురుషోత్తం, సత్యనారాయణ, సంపత్‌రావు, గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్ శిక్షణ నిర్వహించారు.

సార్వత్రిక సమరానికి సన్నద్ధం



నామినేషన్ పత్రాలను స్వీకరించనున్న ప్రాంతం

కరీంనగర్ అర్బన్: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ఘట్టానికి అధికారులు సర్వసన్నద్ధం చేస్తున్నారు. కరీంనగర్ లోక్‌సభ స్థానానికి నామినేషన్లను కలెక్టరేట్‌లో స్వీకరించనున్న సంగతి తెలిసిందే. ఎన్నికల అధికారి పమేలా సత్పతి గురువారం నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు. ఈ క్రమంలో ప్రధాన గేట్ నుంచి కలెక్టర్ చాంబర్ వరకు బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. కలెక్టరేట్ ఉద్యోగుల వాహనాల పార్కింగ్‌ను గాంధీ విగ్రహం ఎదురుగా గల స్థలంలో నిలిపేలా సదరు ప్రాంతాన్ని చదును చేయించారు. ప్రజలు రెండో గేట్ నుంచి రాకపోకలు సాగించేలా ఏర్పాట్లు చేస్తుండగా ఉదయం 11గంటల నుంచి 3గంటల వరకు ప్రధాన గేట్ నుంచి ఎవరికీ ప్రవేశం ఉండదు. నామినేషన్లు దాఖలు చేసే రాజకీయ పార్టీల అభ్యర్థులకు, అధికారులు, ఉద్యోగులు, ప్రజల కోసం వేర్వేరుగా దారులను ఏర్పాటు చేస్తున్నారు.

పార్క్ పనుల్లో భవన వ్యర్థాలు



మల్టీపర్పస్ పార్క్‌లో భవన వ్యర్థాల కుప్పలు



పార్క్‌లో మట్టిని చదును చేస్తున్న సిబ్బంది

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని మల్టీపర్పస్ పార్క్ అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం కొనసాగుతోందనే విమర్శలున్నాయి. ఇప్పటికే వాకింగ్ ట్రాక్ పనుల్లో నాణ్యత పాటించలేదని స్వయంగా నగరపాలకసంస్థ అధికారులే గుర్తించగా, తాజాగా సివిల్ వర్క్స్‌లో మట్టికి బదులుగా భవనాల వ్యర్థాలను వినియోగిస్తున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. స్మార్ట్ సిటీలో భాగంగా నగరంలోని మల్టీపర్పస్ పార్క్ అభివృద్ధి పనులు కొనసాగుతుండడం తెలిసిందే. ఇతర పనులతో పోల్చితే ఈ పార్క్ పనుల్లో విపరీతమైన జాప్యం, నాణ్యతపై వరుసగా ఆరోపణలు వస్తున్నాయి. తాజాగా పార్క్‌లో భవన వ్యర్థాల కుప్పలు పోయడం వివాదాస్పదంగా మారింది. మట్టితో చదునుచేసి గ్రీనరీని ఏర్పాటు చేయాల్సి ఉండగా, మట్టికి బదులుగా భవన వ్యర్థాలను వాడుతున్నారనే ఆరోపణలున్నాయి. పార్క్‌లో భవన వ్యర్థాల కుప్పలు దర్శనమీయగా, వాటిని తాము మరోచోటికి తరలించేందుకు ఇక్కడ ఉంచామని సంబంధిత సూపర్‌వైజర్లు చెప్పడం గమనార్హం. టవర్‌సర్కిల్ సమీపంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయం ఎదురుగా ఉన్న భవనంలో మెటీరియల్‌ను తొలగించాలని చెప్పారని, అక్కడి నుంచి తీసుకొచ్చిన మెటీరియల్‌ను ఖాళీ స్థలం ఉందని ఇక్కడ వేశామని వాళ్లు అంటున్నారు. తర్వాత ఇక్కడి నుంచి ఈ మెటీరియల్‌ను తీసుకెళ్లి డంప్‌యార్డ్‌లో వేస్తామని చెప్పారు. అయితే భవన వ్యర్థాలను నేరుగా తీసుకెళ్లి డంప్‌యార్డ్‌లో వేయకుండా, ఈ పార్క్ స్థలానికి ఎందుకు తీసుకొస్తున్నారనే ప్రశ్నకు సరైన సమాధానం ఇవ్వడం లేదు. ఇదిలాఉంటే గతంలోనూ ఇలాగే భవన వ్యర్థాలు తీసుకొస్తే ఇక్కడి నుంచి తరలించామని, తప్పకుండా తనిఖీ చేస్తామని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

వృద్ధుడి ఆత్మహత్య


బాలయ్య (ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని గూడెం గ్రామానికి చెందిన బొప్ప బాలయ్య (67) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బాలయ్య కొంతకాలంగా కేన్సర్ వ్యాధితో బాధ పడుతున్నాడు. మందులు వాడుతున్నా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది, మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగాడు. కాసేపటికి గమనించిన కుటుంబసభ్యులు ఆయనను ఆస్పత్రికి తరలించేలోగా చనిపోయాడు. మృతుడికి భార్య పద్మ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మల్లాపూర్‌లో వివాహిత..


సుమలత (ఫైల్)

తిమ్మాపూర్(మానకొండూర్): ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుందని ఎల్ఎండీ ఎస్సై చేరాలు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మానకొండూర్ మండలంలోని గొల్లపల్లికి చెందిన సుమలతను ఇదే మండలంలోని మల్లాపూర్‌కు చెందిన గోస్కుల శ్రీనివాస్‌కు ఇచ్చి 2017లో వివాహం జరిపించారు. వీరికి నాలుగేళ్ల పాప ఉంది. కుటుంబ కలహాల కారణంగా మనస్తాపం చెందిన సుమలత మంగళవారం ఉరేసుకుంది. మృతురాలి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం


మహిపాల్ (ఫైల్)

ధర్మారం(ధర్మపురి): మండలంలోని నర్సింగపూర్‌కు చెందిన మిట్ట మహిపాల్(45) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సత్యానారాయణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మహిపాల్ కొంత కాలంగా కడుపు నొప్పితో బాధ పడుతున్నాడు. మందులు వాడినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది, మంగళవారం ఇంట్లోనే క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు కరీంనగర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య మల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నాడు.

లక్ష్మీపూర్ సొసైటీ నిధుల స్వాహాపై విచారణ


రికార్డులు పరిశీలిస్తున్న ఆడిటర్లు

మానకొండూర్ రూరల్: మండలంలోని లక్ష్మీపూర్ పీఏసీఎస్ ఊటూర్ నిధులను సొసైటీ చైర్మన్, సిబ్బంది స్వాహా చేశారని ఆరోపిస్తూ డైరెక్టర్లు గత ఫిబ్రవరిలో డీసీవో రామానుజంకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం ఆడిటర్లు లక్ష్మీపూర్‌లో విచారణ చేపట్టారు. సొసైటీ రికార్డులను పరిశీలించారు. డైరెక్టర్ల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం చైర్మన్ ప్రదీప్‌రెడ్డి, వైస్ చైర్మన్ సతీశ్‌కుమార్‌లతో మాట్లాడారు. డైరెక్టర్లు ఆరోపణలు చేసిన వాటికి రికార్డులు లేనందున 10 రోజుల గడువు కావాలని చైర్మన్ కోరారు. శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆడిటర్లు తెలిపారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ రాజు, సీఈవో రవీందర్ పాల్గొన్నారు.

20 నుంచి క్రికెట్ శిక్షణ శిబిరాలు

- కరీంనగర్, గోదావరిఖని, సిరిసిల్లల్లో నిర్వహణకు హెచ్‌సీఏ పచ్చజెండా
- మే 20 వరకు శిక్షణ
- ఈ నెల 18 లోపు దరఖాస్తు చేసుకున్న వారికే అవకాశం


కరీంనగర్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కేడీసీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఆగంరావు, మురళీధర్‌రావు

కరీంనగర్ స్పోర్ట్స్: క్రికెట్.. ఈ ఆట తెలియని వారుండరు. పాఠశాలలు, కాలేజీలకు సెలవులు వస్తే చాలు ఖాళీ స్థలం ఎక్కడుంటే అక్కడ మూడు కర్రలు, లేకుంటే బండరాళ్లు ఉంచి, బ్యాట్, బాల్‌తో ఆడేస్తుంటారు. ఇంతటి క్రేజ్ ఉన్న క్రికెట్‌లో ఓనమాలు నేర్పించేందుకు హెచ్‌సీఏ, కేడీసీఏ శ్రీకారం చుట్టాయి. సుమారు ఆరేళ్ల తర్వాత క్రికెట్‌లో ఉచిత వేసవి శిక్షణ శిబిరాలను తిరిగి ప్రారంభిస్తున్నాయి. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో వీటిని నిర్వహిస్తుండగా నిష్ణాతులైన కోచ్‌లు, ట్రైనర్‌ల సమక్షంలో శిక్షణ ఇవ్వనున్నారు. కరీంనగర్, గోదావరిఖని, సిరిసిల్లల్లో శిక్షణ శిబిరాలకు హెచ్‌సీఏ పచ్చజెండా ఊపింది.

తొలిసారి బాలికలకు..

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు అనుబంధమైన కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా క్రికెట్ శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నారు. అయితే, తొలిసారి బాలికలకు సైతం శిక్షణ ఇవ్వనున్నారు. అండర్-14, 16, 19, 23 విభాగాల్లో ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు శిక్షణనిస్తారు. ఈ నెల 20 నుంచి మే 20వ తేదీ వరకు శిబిరాలు కొనసాగనున్నాయి.

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి

క్రీడాకారులు తమ పేర్లను www.hycricket.org వెబ్‌సైట్‌లో ఈ నెల 18వ తేదీలోపు నమోదు చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారికే శిక్షణకు అవకాశం ఉంటుంది. శిబిరానికి ఎంపికైన క్రీడాకారులు వైట్ యూనిఫాంతో రావాలి. మిగిలిన కిట్ మొత్తం కేడీసీఏవారు ఇస్తారు.

శిబిరాల ప్రదేశాలు..

కరీంనగర్‌లోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల ఎదురుగా ఉన్న క్రికెట్ సంఘం మైదానంలో శిక్షణ శిబిరం జరగనుంది. క్రీడాకారులు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ 80087 29397. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని జీఎం గ్రౌండ్ వేదికగా శిబిరం నిర్వహించనున్నారు. క్రీడాకారులు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ 98663 51620. సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శిక్షణనివ్వనున్నారు. క్రీడాకారులు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ 94943 62362.

అంజన్న సన్నిధిలో తాగునీటికి ప్రాధాన్యం

- భక్తులకు ఇబ్బంది రానీయొద్దు
- సమీక్షా సమావేశంలో అడిషనల్ కలెక్టర్ దివాకర


మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ దివాకర

కొండగట్టు(చొప్పదండి): ఈనెల 22 నుంచి 24 వరకు కొండగట్టు అంజన్న సన్నిధిలో జరిగే హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని, దీక్షాపరులకు ఎట్టి పరిస్థితుల్లోనూ తాగునీటికి ఇబ్బంది రానీయొద్దని అడిషనల్ కలెక్టర్ దివాకర అధికారులను ఆదేశించారు. స్థానిక ఈవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ముఖ్యంగా తాగునీటికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. చలివేంద్రాలను రోడ్డుకిరువైపులా ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాల పార్కింగ్‌కు ఏడుచోట్ల స్థలాలు గుర్తించామన్నారు. రాత్రివేళ లైటింగ్ ఏర్పాటు చేయాలని, పాదయాత్రన వచ్చే భక్తులకు చిన్నపాటి ఇబ్బంది రానీయొద్దని పేర్కొన్నారు. మాల విరమణ, కేశ ఖండనం, కోనేరు ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పరిశుభ్రత పాటించాలన్నారు. 100 సీసీ కెమెరాలు, రెండు అంబులెన్స్‌లు, ఆరు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. పారిశుధ్య నిర్వహణకు 380 మందిని నియమిస్తామన్నారు. కోనేరులో నీటిని ఎప్పటికప్పుడు మార్చాలని సూచించారు. పోలీస్ కంట్రోల్ రూం, మీడియాసెంటర్లు ప్రారంభించి ఎప్పటికప్పుడు భక్తులకు సమాచారం చేరవేసేలా చూడాలన్నారు. ఈవో చంద్రశేఖర్, ఏఈవో అంజయ్య, అధికారులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో 'పారమిత' ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న విద్యాసంస్థల డైరెక్టర్లు

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్ పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థులు ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్‌లో ప్రతిభ కనబరిచి, అవార్డులు కైవసం చేసుకున్నట్లు ప్రధానోపాధ్యాయుడు రితేశ్ మెహతా తెలిపారు. గణితంలో వెల్డి హర్షిణి(ఏడోతరగతి) 2వ ర్యాంకు, జొన్నల సాయిరిషిత్(ఏడోతరగతి) 5వ ర్యాంకు, జీకే విభాగంలో భవిక్(ఆరోతరగతి) 3వ ర్యాంకుతోపాటు మరో 16 మంది విద్యార్థులు బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలు అందుకున్నారని పేర్కొన్నారు. వారిని పారమిత విద్యాసంస్థల చైర్మన్ ఇ.ప్రసాదరావుతోపాటు డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, రశ్మిత, రాకేశ్, వి.యు.ఎం.ప్రసాద్, వినోద్‌రావు, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ, కో–ఆర్డినేటర్ రాము, గైడ్ టీచర్లు ప్రదీప్‌కుమార్, సంధ్యారాణి, అంజిరెడ్డి, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.

చిన్నారిని చిదిమేసిన స్కూల్ వ్యాన్

- తల్లిని వెతుక్కుంటూ వెళ్లి.. మృత్యుఒడికి
- కుమారుడిని బడికి పంపించేందుకు వెళ్లిన తల్లి
- టైర్ కింద పడి ఏడాదిన్నర చిన్నారి దుర్మరణం
- జగిత్యాల జిల్లా మల్యాల మండలం మద్దుట్లలో విషాదం


సంఘటన స్థలంలో గుమిగూడిన ప్రజలు


రోదిస్తున్న కుటుంబ సభ్యులు


అరిబా (ఫైల్)

మల్యాల(చొప్పదండి): కుమారుడిని స్కూల్ వ్యాన్ ఎక్కించేందుకు వెళ్లిన తల్లిని వెతుక్కుంటూ వెళ్లిన చిన్నారి అదే స్కూల్ వ్యాన్ కిందపడి అక్కక్కడికే మృతిచెందిన సంఘటన జగిత్యాల జిల్లా మల్యాల మండలం మద్దుట్లలో చోటుచేసుకుంది. మండలంలోని మద్దుట్లకు చెందిన ఎండీ.హసీనా, రజాక్‌కు సాజిత్ (4), కూతురు అరిబా (ఏడాదిన్నర) ఉన్నారు. సాజిత్ రామన్నపేటలోని సరస్వతి విద్యానికేతన్‌లో చదువుతున్నాడు. ఎప్పటిలాగే మంగళవారం కూడా కూతురు అరిబాను ఇంట్లో ఉంచి.. సాజిత్‌ను స్కూల్ వ్యాన్ ఎక్కించేందుకు తల్లి హసీనా వెళ్లింది. అరిబా తల్లిని వెతుకుతూ స్కూల్ వ్యాన్ వద్దకు చేరుకుంది. తల్లి కోసం స్కూల్ బస్ ముందువైపు నుంచి వెళ్లడం.. గమనించకుండా డ్రైవర్ ముందుకు కదలడంతో చిన్నారి టైర్ల కింద పడిపోయింది. తలపైనుంచి టైరు వెళ్లడంతో మెదడు చితికిపోయింది. స్థానికులు తండ్రి రజాక్‌కు సమాచారం అందించారు. వెంటనే ఆయన చిన్నారిని ఆటోలో జగిత్యాల ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతిచెందిందని వైద్యులు నిర్ధారించారు.

పది నిమిషాలు ముందు వచ్చి ఉంటే..

అరిబా తండ్రి రజాక్ ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ప్రతిరోజూ కూరగాయలు తీసుకొచ్చేందుకు వేకువజామునే జగిత్యాల వెళ్తాడు. వచ్చాక సాజిత్‌ను స్కూల్‌కు పంపిస్తాడు. ఎప్పటిలాగే జగిత్యాల వెళ్లిన రజాక్‌కు కాస్త ఆలస్యమైంది. దీంతో హసీనా సాజిత్‌ను వ్యాన్ ఎక్కించేందుకు వెళ్లింది. అంతలోనే ఘోరం జరిగిపోయింది. తాను ముందుగొచ్చినా కూతురు బతికేదని రజాక్ రోదించిన తీరు కలిచివేసింది. రజాక్ ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన స్కూల్ వ్యాన్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక


బాస్కెట్‌బాల్ జగిత్యాల బాలికల జట్టు

జగిత్యాలటౌన్: ఈ నెల 25వ తేదీ నుంచి 27 వరకు డీపీఎస్ స్కూల్ మియాపూర్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌కు జగిత్యాల జిల్లా బాలబాలికల జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా క్రీడా కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. బాలుర జట్టులో మంజునాథ్, శ్రీచరణ్, అభినవ్, అఖిల్, రామ్‌చరణ్, ప్రీతం, రోహన్, బి.శ్రీచరణ్, రాహుల్, వర్షిత్, సాకేత్, సాయిశ్రీగ్నేశ్, బాలికల జట్టులో శరణ్య, వర్షిత, అక్షిత, సంజన, సహస్ర, అర్చన, సుధాన్వి, హారిక, పూజ, కీర్తన, సమీక్ష ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. కార్యక్రమంలో పెటా జిల్లా అధ్యక్షుడు పడాల విశ్వప్రసాద్, నిరంజన్, రవికుమార్, కృష్ణప్రసాద్, అజయ్ బాబు, వేణు, రాజ్‌కుమార్, శశి, మంగ, విజ్ఞాన్, శ్రీరాం, సామంత్, హరీశ్ పాల్గొన్నారు.

శుభకార్యానికి వెళ్లొస్తూ మృత్యు ఒడికి..

- రోడ్డు ప్రమాదంలో గాయపడి, చికిత్స పొందుతూ యువకుడి మృతి
- కోర్టు కేసు ఉండటంతో 2 నెలల కిందటే దుబాయ్ నుంచి రాక
- నాగయ్యపల్లెలో విషాదం


సాయికుమార్ (ఫైల్)

చందుర్తి(వేములవాడ): ఓ కేసులో నిందితుడిగా ఉన్న ఓ యువకుడు దుబాయ్ నుంచి వచ్చిన 2 నెలలకే మృత్యుఒడికి చేరాడు. శుభకార్యానికి వెళ్లొస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి, చికిత్స పొందుతూ మృతిచెందాడు. బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. వేములవాడ రూరల్ మండలంలోని నాగయ్యపల్లెకు చెందిన సెట్టుపల్లి లక్ష్మి–వెంకటేశ్ దంపతుల కుమారుడు సాయి ఉరఫ్ సాయికుమార్. రెండేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. అంతకుముందు ప్రేమ పెళ్లి చేశాడని ఇతనిపై వేములవాడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇది కోర్టులో ట్రయల్‌కు రావడంతో సాయికుమార్ తల్లిదండ్రులు అతన్ని దుబాయ్ నుంచి రమ్మనడంతో 2 నెలల క్రితమే వచ్చాడు. సోమవారం చందుర్తి మండలం జోగాపూర్‌లోని తమ బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి బైక్‌పై వెళ్లాడు. తిరిగి వస్తుండగా మూడపల్లి శివారులోని నర్సింగాపూర్ క్రాస్‌రోడ్డు వద్ద వాహనం అదుపుతప్పి, మైలురాయిపై ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయికుమార్ తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతని పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ పేర్కొన్నారు.

కోర్టు కేసు ముగిస్తే తిరిగి దుబాయ్‌కి..

కోర్టులో కేసు ముగిస్తే సాయికుమార్ తిరిగి దుబాయ్ వెళ్లేవాడు. కానీ, అనుకోకుండా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడటంతో అతని కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడికి ఒక అక్క, చెల్లి ఉన్నారు. ఏకైక కుమారుడు చనిపోవడంతో ఆ తల్లిదండ్రులు తమకు దిక్కెవరంటూ రోదించిన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది.

చీమలపేటలో ఇద్దరికి డెంగీ


మందులు ఇస్తున్న వైద్యాధికారి సంపత్‌రెడ్డి

జూలపల్లి(పెద్దపల్లి): మండల ప్రజలు వైరల్ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని, సకాలంలో వైద్యపరీక్షలు చేయించుకోవాలని మండల వైద్యాధికారి సంపత్ రెడ్డి సూచించారు. చీమలపేట గ్రామంలో మంగళవారం వైరల్ జ్వరాల సర్వేతో పాటు పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పా టు చేసి, 78 మంది జ్వర పీడితులకు వైద్య పరీక్షలు నిర్వహించగా ఎగుర్ల గట్టయ్య, రాజులకు డెంగీ జ్వరంగా నిర్ధారణ అయ్యింది. దీంతో గ్రామంలో పంచాయతీ సిబ్బందితో పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఎస్‌యూవో బి.ఆంజయ్య, హెచ్‌వీ వసంత, ఎంఎల్‌హెచ్‌పీ అంజలి, ఏఎన్ఎం అరుణ, హెచ్ఏ అనంతరావు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

రేషన్ దుకాణంలో తనిఖీ

రామగుండం: అంతర్గాం మండలం ముర్మూర్‌లో డీలర్ వి.శారదకు చెందిన రేషన్ దుకాణంలో సివిల్ సప్లయ్ అధికారులు మంగళవారం తనిఖీ నిర్వహించారు. బియ్యం నిల్వలు పరిశీలించారు. 11 క్వింటాళ్ల బియ్యం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించి, డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేశారు. జిల్లా సివిల్ సప్లయ్ అధికారి ప్రేమ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు మల్లికార్జున్ రావు(పెద్దపల్లి), శ్రీనివాస్ (మంథని), సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ రవీందర్ రాథోడ్(మంథని) తదితరులున్నారు.

'అల్ఫోర్స్ శ్రీవిద్యాభారతి'లో గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించిన చైర్మన్ నరేందర్ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్ కిసాన్‌నగర్‌లోని అల్ఫోర్స్ శ్రీవిద్యాభారతి స్కూల్లో మంగళవారం యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి హాజరై, పిల్లలకు ప్రశంసా పత్రాలు అందించి, అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక విద్య నుంచే విద్యార్థులకు పరిశోధనాత్మక సమాచారం అందిస్తూ వారిలో ఆసక్తి పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు సైతం పిల్లలకు వినూత్న అంశాలను తెలియజేస్తూ వారిలో ఉత్సాహం నింపాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్య భవితకు పునాది

జగిత్యాల: ప్రాథమిక విద్య భవితకు పునాది అని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జగిత్యాల శివవీధిలో గల అల్ఫోర్స్ స్కూల్లో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే విద్య నేర్చుకోవాలని, నిర్లక్ష్యం చేయవద్దన్నారు. అనంతరం యూకేజీ పూర్తి చేసిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు.

పోలీసుల అదుపులో గంజాయి దొంగలు?

జగిత్యాల క్రైం/సారంగాపూర్: జగిత్యాల జిల్లా సారంగాపూర్ పోలీస్‌స్టేషన్‌లో 15 రోజుల క్రితం అంబులెన్స్‌లో నుంచి 70 కిలోల గంజాయి మాయమైంది. దొంగలను పోలీసులు ఎట్టకేలకు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. సారంగాపూర్‌కే చెందిన నలుగురు యువకులు పథకం ప్రకారం ఠాణా వెనకాల నిలిపి ఉన్న అంబులెన్స్‌లో గంజాయి ఉన్నట్లు గుర్తించి, పోలీసులు నిద్రిస్తున్న సమయంలో చోరీ చేసినట్లు తెలిసింది. పోలీసుల అదుపులో ఉన్నవారు గంజాయి దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నట్లు, వారి వద్ద నుంచి కొంత గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిసింది. అయితే, గంజాయి మాయంపై రాష్ట్ర ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నారని, బాధ్యులపై సస్పెన్షన్ వేటు పడుతుందన్న తరుణంలో దొంగలు పట్టుబడటంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నట్లు సమాచారం. పూర్తి సమాచారం సేకరించి, రెండు, మూడు రోజుల్లో వారిని ఉన్నతాధికారుల ఎదుట హాజరుపర్చనున్నట్లు తెలిసింది.


గంజాయి విక్రయిస్తున్న ఆరుగురి అరెస్టు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): గంజాయి విక్రయిస్తున్న ఆరుగురిని అరెస్టు చేశామని గోదావరిఖని టూటౌన్ సీఐ రవీందర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. యైటింక్లయిన్ కాలనీ వారసంతలో ఈ నెల 15న గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. వారు వెంటనే అక్కడికి వెళ్లి, అనుమానాస్పదంగా తిరుగుతున్న మచ్చుపేటకు చెందిన ఇరికిల్ల రఘును అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతను కొంత కాలంగా గుంటూరుపల్లికి చెందిన శివ రూట్ వద్ద గంజాయి కొనుగోలు చేస్తూ యైటింక్లయిన్‌కాలనీ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. పూర్తి వివరాలు తెలుసుకున్న పోలీసులు మంగళవారం గుంటూరుపల్లికి వెళ్లి, చిలుముల మధును, గోదావరిఖని విఠల్‌నగర్‌లో వినోద్ ఖన్నా, తిలక్ నగర్‌లో గుజ్జుల శివప్రసాద్, సెంటినరీకాలనీలో మంథని చైతన్య అలియాస్ బన్నీ, ఆరెల్లి సాయి రేవంత్‌లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 1.117 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని, ఆరుగురినీ జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినట్లు సీఐ పేర్కొన్నారు.

అత్తింటివారిపై వరకట్న వేధింపుల కేసు

జమ్మికుంట(హుజూరాబాద్): అదనపు వరకట్నం తీసుకురావాలంటూ ఓ వివాహితను వేధిస్తున్న ఆమె అత్తింటివారిపై కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట టౌన్ సీఐ రవి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలంలోని కోరపల్లికి చెందిన పల్లె నిఖిలను హైదరాబాద్‌కు చెందిన గోడల శివచరణ్‌కు ఇచ్చి 2022లో వివాహం జరిపించారు. పెళ్లి సమయంలో ఒప్పుకున్న కట్నకానుకలు ముట్టజెప్పారు. ఆరు నెలల వరకు వీరి కాపురం సవ్యంగా సాగింది. తర్వాత హైటెక్ సిటీలో ఇల్లు, రూ.80 లక్షల కట్నం అదనంగా తీసుకురావాంటూ భర్త, అత్తామామ వేధించడం ప్రారంభించారు. దీంతో నిఖిల మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

నగదు పట్టివేత


డబ్బులు చూపుతున్న ఎస్సై కిరణ్‌కుమార్

మల్లాపూర్(కోరుట్ల): మండలంలోని రాఘవపేట శివారులో మంగవారం సాయంత్రం చేపట్టిన వాహన తనిఖీల్లో రూ.98 వేలు పట్టుకున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. సదరు వ్యక్తి సరైన పత్రాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకొని, గ్రీవెన్స్ సెల్‌కి అప్పగించినట్లు పేర్కొన్నారు. కానిస్టేబుల్ రాజేశ్ తదితరులున్నారు.

ఎడారిగా మారుతుంటే చూడలేకపోయాం

- ఎమ్మెల్యేలు కమలాకర్, విజయరమణారావు, ప్రకాశ్‌గౌడ్
- బాబ్లీ కేసులో బిలోలి సెషన్స్ కోర్టుకు హాజరు


కోర్టు ఎదుట ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు

కరీంనగర్: తెలంగాణ ప్రాంత రైతుల భూములు ఎడారిగా మారుతుంటే చూస్తూ ఉండలేక ఆనాడు బాబ్లీ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ధర్నా చేపట్టామని కరీంనగర్, పెద్దపల్లి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, విజయరమణారావు, ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. బాబ్లీ కేసు విచారణలో భాగంగా మంగళవారం మహారాష్ట్రలోని బిలోలి సెషన్స్ కోర్టుకు హాజరయ్యామన్నారు. వారి వెంట మాజీ ఎమ్మెల్యేలు హన్మంతు షిండే, కేఎస్ రత్నం ఉన్నారు.

శుభలేఖలు పంచేందుకు వచ్చి..

- రోడ్డు ప్రమాదంలో లంబాడిపల్లి యువకుడి మృతి

జగిత్యాల క్రైం: బంధువులకు శుభలేఖలు పంచేందుకు వచ్చిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా లక్సెట్‌పేట్ బోయవాడకు చెందిన బోరె మహేశ్(21) తన మిత్రుడు జిన్న శ్రీకాంత్‌తో కలిసి మంగళవారం శుభలేఖలు పంచేందుకు మల్యాల మండలం లంబాడిపల్లికి బైక్‌పై వచ్చాడు. సాయంత్రం తిరిగి లక్సెట్‌పేట్ వెళ్తుండగా జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామంలో జగిత్యాల–కరీంనగర్ ప్రధాన రహదారిపై వెనక నుంచి వచ్చిన ఓ కారు ఢీకొట్టింది. ద్విచక్ర వాహనంపై వెనక కూర్చున్న మహేశ్‌కు బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీకాంత్ గాయపడగా స్థానికులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న ఎస్సై సంఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	456	72,944
నిఫ్టీ ▽	125	22,148

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	15,899	△ 13
డోజోన్స్	37,857	△ 122
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,166	△ 89
డాక్స్	15,509	△ 328
షాంఘై	3,007	▽ 50
నికాయ్	38,471	▽ 762

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	73,302	△ 1,488
బంగారం (99.5 స్వచ్ఛత)	73,008	△ 1,487
వెండి (కిలో)	83,213	▽ 239

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.04	84.06
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.56	106.76
€	యూరో	ఎస్‌బీఐ	87.82	90.16
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	53.77	54.97
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.20	55.12
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.26	63.40
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.37	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.84	23.58
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.40	12.38

ఎంఎఫ్ ఆస్తులు రూ. 53.4 లక్షల కోట్లు

- 2023–24లో 35 శాతం జూమ్
- వార్షికంగా రూ. 14 లక్షల కోట్ల జమ
- 17.78 కోట్లకు ఫోలియోల సంఖ్య



న్యూఢిల్లీ: దేశీయంగా మ్యూచువల్ ఫండ్స్(ఎంఎఫ్‌లు) ఆస్తులు గత ఆర్థిక సంవత్సరం(2023–24)లో 35% జంప్ చేశాయి. రూ. 53.4 లక్షల కోట్లను తాకాయి. వార్షికంగా రూ. 14 లక్షల కోట్లమేర ఎగశాయి. ఇందుకు ప్రధానంగా రిటైల్ ఇన్వెస్టర్ల పెట్టుబడులు, లాభాల పరుగు తీస్తున్న ఈక్విటీ మార్కెట్లు ప్రభావం చూపాయి. వెరసి 2020–21 ఏడాది(41 శాతం వృద్ధి) తదుపరి గరిష్టస్థాయిలో ఎంఎఫ్ ఆస్తులు బలపడినట్లు వార్షిక నివేదికలో ఫండ్స్ దేశీ అసోసియేషన్(యాంఫి) వెల్లడించింది. ఎంఎఫ్‌ల నిర్వహణలోని ఆస్తుల(ఏయూఎం) పురోగతి.. ఫండ్స్ పరిశ్రమలో పెరుగుతున్న ఇన్వెస్టర్లను ప్రతిబింబిస్తున్నట్లు పేర్కొంది. ఫలితంగా మార్చి చివరికల్లా ఫోలియోల సంఖ్య 17.78 కోట్లను తాకింది. ఇది సరికొత్త రికార్డు కాగా.. ఇన్వెస్టర్ల బేస్ 4.46 కోట్లకు చేరింది. ఇన్వెస్టర్ల సంఖ్యలో మహిళల వాటా 23 శాతంకావడం గమనార్హం!

సిప్ దన్ను

క్రమబద్ధ పెట్టుబడుల(సిప్) పథకాలను ఇన్వెస్టర్లు ఆదరిస్తుండటంతో వీటి సంఖ్య బలపడుతోంది. దీంతో నెలవారీ నికర పెట్టుబడులు మార్చిలో రూ. 19,300 కోట్లకు చేరాయి. పూర్తి ఏడాదిలో సిప్ పథకాల ద్వారా రూ. 2 లక్షల కోట్ల నికర పెట్టుబడులు లభించాయి. ఇది ఇన్వెస్టర్లలో పెరుగుతున్న ఆసక్తిని పట్టిచూపుతోంది. అంతేకాకుండా క్రమశిక్షణతోకూడిన పెట్టుబడులను ప్రతిబింబిస్తోంది. దేశీ ఎంఎఫ్ పరిశ్రమకు గతేడాది మైలురాయివంటిదని యాంఫి నివేదిక పేర్కొంది. ఏయూఎం చెప్పుకోదగ్గవిధంగా రూ. 14 లక్షల కోట్లమేర పెరిగి సరికొత్త రికార్డ్ నెలకొల్పుతూ రూ. 53.4 లక్షల కోట్లకు చేరినట్లు వివరించింది. 2022–23లో ఫండ్స్ ఏయూఎం విలువ రూ. 39.42 లక్షల కోట్లు మాత్రమేనని ప్రస్తావించింది. ఈక్విటీ, హైబ్రిడ్, సొల్యూషన్ ఆధారిత పథకాలు తదితరాలలో ప్రధానంగా రిటైల్ ఇన్వెస్టర్లు భారీగా ఇన్వెస్ట్ చేసినట్లు పేర్కొంది. పరిశ్రమ ఆస్తుల్లో వీటి వాటా 58 శాతంకాగా.. ఫోలియో సంఖ్యలో 80 శాతాన్ని ఆక్రమిస్తున్నట్లు వెల్లడించింది. ఇవన్నీ ఎంఎఫ్‌ల ద్వారా క్యాపిటల్ మార్కెట్లలో పెరుగుతున్న కుటుంబ మదుపును ప్రతిబింబిస్తున్నట్లు తెలియజేసింది.

ఈక్విటీకే ఓటు

గతేడాది పెట్టుబడుల్లో ఈక్విటీ ఆధారిత పథకాలు 55 శాతం వృద్ధిని అందుకుని ఆస్తులలో రూ. 23.5 లక్షల కోట్లకు చేరాయి. ఇందుకు పెట్టుబడులతో పాటు.. మార్క్‌టు మార్కెట్(ఎంటుఎం) లాభాలు సహకరించాయి. అయితే మరోవైపు రుణ పథకాల ఫండ్స్ 7 శాతమే బలపడ్డాయి. ఏయూఎంలో రూ. 12.62 లక్షల కోట్లకు చేరాయి. అయినప్పటికీ అంతక్రితం రెండేళ్లలో ఆస్తులు తగ్గుతూ వచ్చిన అంశంతో పోలిస్తే మెరుగేనని నివేదిక తెలియజేసింది.

మూడోరోజూ పతనమే

- సెన్సెక్స్ 456 పాయింట్లు డౌన్
- నిఫ్టీ 125 పాయింట్ల క్షీణత
- మూడు వారాల దిగువకు సూచీలు
- శ్రీరామ నవమి సందర్భంగా నేడు ఎక్స్ఛేంజీలకు సెలవు



ముంబై: పశ్చిమాసియాలోని ఉద్రిక్తతలు, ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో బలహీన సంకేతాలతో స్టాక్ సూచీలు మూడో రోజూ నష్టాలు చవిచూశాయి. ఐటీ, మెటల్, బ్యాంకులు, ఫైనాన్స్ షేర్లలో విక్రయాలు వెల్లువెత్తడంతో సెన్సెక్స్ 456 పాయింట్లు నష్టపోయి 72,944 వద్ద నిలిచింది. నిఫ్టీ 125 పాయింట్లు కోల్పోయి 22,148 వద్ద స్థిరపడింది. ఇవి 3 వారాల కనిష్ట స్థాయిలు కాగా.. నష్టాలతో మొదలైన సూచీలు ప్రథమార్ధమంతా తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 715 పాయింట్లు నష్టపోయి 72,685 వద్ద, నిఫ్టీ 147 పాయింట్లు క్షీణించి 22,125 వద్ద ఇంట్రాడే కనిష్టాలను నమోదు చేశాయి. అయితే మిడ్‌సెషన్ నుంచి ఇంధన, ఆయిల్, విద్యుత్, వినిమయ, పారిశ్రామిక, కన్జూమర్ రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు దాదాపు సగం నష్టాలు భర్తీ చేసుకోగలిగాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు 0.57%, 0.05% చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.4,468 కోట్ల ఈక్విటీలు అమ్మేయగా, డీఐఐలు రూ.2,040 కోట్ల షేర్లను కొనుగోలు చేశాయి.

- ➤ శ్రీరామ నవమి సందర్భంగా నేడు (బుధవారం) బీఎస్ఈ, ఎన్ఎస్ఈలకు సెలవు. బులియన్, ఫారెక్స్ మార్కెట్లు కూడా పనిచేయవు. కమోడిటీ మర్కెట్లు మాత్రం సాయంత్రం సెషన్‌లో పనిచేస్తాయి.
- ➤ అమెరికా వడ్డీ రేట్ల వాయిదా అంచనాలతో ఐటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఇన్ఫోసిస్ 4%, ఎంఫసీస్ 3.50%, కోఫోర్జ్ 3%, పర్‌సిస్టెంట్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా, టీసీఎస్ షేర్లు రెండుశాతం చొప్పున నష్టపోయాయి.
- ➤ వెల్త్‌మేనేజ్‌మెంట్, బ్రోకింగ్ కంపెనీల ఏర్పాటుకు బ్లాక్‌రాక్‌తో ఒప్పందం చేసుకోవడంతో జియో ఫైనాన్సియల్ సర్వీసెస్ షేరు 2% లాభపడి రూ.362 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 5% ఎగసి రూ.372 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకుంది. కంపెనీ మార్కెట్ విలువ రూ.4,733 కోట్లు పెరిగి రూ.2.30 లక్షల కోట్లకు చేరింది.
- ➤ సెన్సెక్స్ మూడు రోజుల్లో 2,094 పాయింట్ల పతనంతో బీఎస్ఈలో మార్కెట్ విలువలో రూ.7.93 లక్షల కోట్లు మాయమ్యాయి.

రికార్డు కనిష్టానికి రూపాయి

- 83.61కి దేశీ కరెన్సీ విలువ

డాలర్ మారకంలో రూపాయి విలువ 17 పైసలు నష్టపోయి జీవితకాల కనిష్ట స్థాయి 83.61 వద్ద ముగిసింది. ఇరాన్–ఇజ్రాయిల్ యుద్ధ ఉద్రిక్తతలతో ఆరు ప్రధాన కరెన్సీ విలువల్లో డాలర్ 5 నెలల గరిష్టానికి బలపడటం ప్రధాన కారణం. ఉదయం ఫారెక్స్ మార్కెట్లో 83.51 వద్ద మొదలైంది. రోజంతా నష్టాల్లో కదలాడి ఇంట్రాడే కనిష్టం(83.61) వద్ద స్థిరపడింది. ఈ ఏడాది మార్చి 22న ఇదే స్థాయి(83.61) వద్ద జీవితకాల కనిష్టాన్ని తాకింది. వెరసి గడిచిన నాలుగు వారాల్లో దేశీయ కరెన్సీ రెండోసారి జీవితకాల కనిష్టాన్ని నమోదు చేయడం గమనార్హం.

మళ్లీ మెరిసిన పసిడి, వెండి

బంగారం కొత్త రికార్డు రూ. 73,750

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల భయాలతో పసిడి, వెండి పరుగు కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్లలోని ధోరణులకు తగ్గట్లు దేశీయంగా వెండి, బంగారం ధరలు మంగళవారం మరో రికార్డు స్థాయిని తాకాయి. హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ ప్రకారం దేశ రాజధానిలో ఉదయం పసిడి 10 గ్రాముల ధర రూ. 700 పెరిగి జీవితకాల గరిష్ట స్థాయి అయిన రూ. 73,750ని తాకింది. అదే విధంగా వెండి ధర కూడా కేజీకి రూ. 800 పెరిగి రూ. 86,500 స్థాయిని తాకింది. ఎంసీఎక్స్‌లో జూన్ కాంట్రాక్టు ధర ఇంట్రా–డేలో రూ. 72,927 స్థాయిని తాకింది. అంతర్జాతీయ మార్కెట్లు చూస్తే కామెక్స్‌లో ఔన్సు (31.1 గ్రాముల) పసిడి ధర 15 డాలర్లు పెరిగి 2,370 వద్ద ట్రేడయ్యింది. భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగినంత కాలం బంగారం బులిష్‌గానే ఉండనున్నట్లు ఎల్‌కేపీ సెక్యూరిటీస్ వైస్ ప్రెసిడెంట్ జతిన్ త్రివేది తెలిపారు.




కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

17-4-2024 ఫామ్ ధర...	
విశాఖ	419–00
చిత్తూరు	483–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	404–00
విజయవాడ	404–00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	405–00
వరంగల్	407–00
రిటైల్ ధర	4.65

క్రిసిల్ క్యూ1 లాభం డౌన్

షేరుకి రూ. 7 డివిడెండ్



న్యూఢిల్లీ: రేటింగ్ దిగ్గజం క్రిసిల్ ఈ ఆర్థిక సంవత్సరం(2024) తొలి త్రైమాసికం(క్యూ1)లో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చిలో కన్సాలిడేటెడ్ నికర లాభం 5 శాతంపైగా క్షీణించి రూ. 138 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2023) ఇదే కాలం(క్యూ1)లో రూ. 146 కోట్లు ఆర్జించింది. కంపెనీ కేలండర్ ఏడాదిని ఆర్థిక సంవత్సరంగా పరిగణించే సంగతి తెలిసిందే. అయితే మొత్తం ఆదాయం నామమాత్ర వృద్ధితో రూ. 751 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ1లో రూ. 732 కోట్ల టర్నోవర్ సాధించింది. మొత్తం వ్యయాలు సైతం రూ. 539 కోట్ల నుంచి రూ. 563 కోట్లకు స్వల్పంగా పెరిగాయి. గతేడాది(2023)కిగాను కంపెనీ బోర్డు షేరుకి రూ. 7 చొప్పున వాటాదారులకు మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. మే 14న డివిడెండ్ చెల్లించనుంది. కాగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24)లో జీడీపీ 6.8 శాతం వృద్ధిని సాధించవచ్చని క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది.

క్రిసిల్ షేరు 3% తగ్గి రూ. 4,700 వద్ద ముగిసింది.

సోనీతో విలీనంపై జీ పిటిషన్ ఉపసంహరణ

న్యూఢిల్లీ: సోనీతో విలీన ప్రతిపాదన అమలయ్యేలా ఆదేశాలివ్వాలంటూ ఎన్‌సీఎల్‌టీలో దాఖలు చేసిన పిటిషన్‌ను జీ ఎంటర్‌టైన్‌మెంట్ (జీల్) ఉపసంహరించుకుంది. న్యాయ నిపుణుల సలహా మేరకు ఈ నిర్ణయం తీసుకున్న ట్లు వివరించింది. షేర్‌హోల్డర్లకు మరింత విలువ చేకూర్చే అవకాశాలను ఉపయోగించుకోవడంపై, సోనీపై ఆర్బిట్రేషన్ ప్రొసీడింగ్స్‌ను కొనసాగించడంపై దృష్టి పెట్టనున్నట్లు పేర్కొంది. సోనీ భారత వ్యాపార విభాగం, జీల్ విలీనంపై కొన్నాళ్లుగా కసరత్తు జరిగినప్పటికీ ఒప్పందం కుదరని సంగతి తెలిసిందే.

జ్యువెలరీ వ్యాపారంలోకి ఆదిత్య బిర్లా గ్రూప్

- రూ. 5 వేల కోట్ల పెట్టుబడుల ప్రణాళికలు
- ఏబీసీ డిజిటల్ సూపర్ యాప్ ఆవిష్కరణ



ముంబై: ఆదిత్య బిర్లా గ్రూప్ కొత్తగా జ్యువెలరీ రిటైల్ వ్యాపారంలోకి అడుగుపెట్టనుంది. ఇందుకోసం రూ. 5,000 కోట్ల మేర ఇన్వెస్ట్ చేయనుంది. మంగళవారం ఆదిత్య బిర్లా క్యాపిటల్ డిజిటల్ (ఏబీసీడీ) సూపర్ యాప్‌ను ఆవిష్కరించిన సందర్భంగా సంస్థ చైర్మన్ కేఎం బిర్లా ఈ విషయాలు వెల్లడించారు. ఆదిత్య బిర్లా గ్రూప్ ఈ మధ్యే పెయింట్స్ వ్యాపారంలోకి కూడా ప్రవేశించిన సంగతి తెలిసిందే. మరోవైపు, డిజిటల్ ప్లాట్‌ఫాం ద్వారా వచ్చే మూడేళ్లలో 3 కోట్ల మంది పైగా కొత్త కస్టమర్లను చేర్చుకోవాలని నిర్దేశించుకున్నట్లు బిర్లా వివరించారు. ప్రస్తుతం రుణాలు, బీమా, అసెట్ మేనేజ్‌మెంట్ తదితర వ్యాపార విభాగాల ద్వారా ఆదిత్య బిర్లా క్యాపిటల్ సుమారు 3.5 కోట్ల మంది కస్టమర్లకు సేవలు అందిస్తోంది. సూపర్ యాప్‌లో 22 ఉత్పత్తులు, సర్వీసులు అందుబాటులో ఉంటాయని చెప్పారు.

భవిత

జాబ్ పాయింట్

ఆర్‌పీఎఫ్, ఆర్‌పీఎస్‌ఎఫ్‌లో 4,660 పోస్టులు

రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు(ఆర్ఆర్‌బీ).. దేశవ్యాప్తంగా అన్ని రైల్వే రీజియన్లలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్), రైల్వే ప్రొటెక్షన్ స్పెషల్ ఫోర్స్(ఆర్‌పీఎస్ఎఫ్)లో సబ్ ఇన్‌స్పెక్టర్(ఎస్ఐ), కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 4,660
- » **పోస్టుల వివరాలు:** సబ్ ఇన్‌స్పెక్టర్(ఎస్ఐ)–452, కానిస్టేబుల్–4208.
- » **ఆర్ఆర్‌బీ రీజియన్లు:** అహ్మదాబాద్, అజ్మీర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీఘడ్, చెన్నై, గోరఖ్‌పూర్, గువాహటి, జమ్మూ–శ్రీనగర్, కోల్‌కతా, మాల్దా, ముంబై, ముజఫర్‌పూర్, పాట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సికింద్రాబాద్, సిలిగురి, తిరువనంతపురం.
- » **అర్హత:** కానిస్టేబుల్ పోస్టులకు పదో తరగతి, ఎస్ఐ ఉద్యోగాలకు డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
- » **వయసు:** 01.07.2024 నాటికి కానిస్టేబుల్ పోస్టులకు 18 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్ఐ పోస్టులకు 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **ప్రారంభ వేతనం:** నెలకు ఎస్ఐ పోస్టులకు రూ.35,400. కానిస్టేబుల్ పోస్టులకు 21,700
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష(సీబీటీ), ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్, మెడికల్ స్టాండర్డ్ టెస్ట్, సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 15.04.2024
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**14.05.2024
- » **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://rpf.indianrailways.gov.in

సింగేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, కొత్తగూడెంలో 327 ఉద్యోగాలు

తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్(ఎస్‌సీసీఎల్).. వివిధ విభాగాల్లో ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 327

పోస్టుల వివరాలు

- » **ఎగ్జిక్యూటివ్ కేడర్:** మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఈ–ఎం), ఈ2 గ్రేడ్–42, మేనేజ్‌మెంట్ ట్రైనీ(సిస్టమ్స్), ఈ2 గ్రేడ్–07.
- » **నాన్–ఎగ్జిక్యూటివ్ కేడర్:** జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రైనీ(జేఎంఈటీ), టీ–ఎస్ గ్రేడ్ సి–100, అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రైనీ(మెకానికల్), టీ–ఎస్ గ్రేడ్ సి–09, అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రైనీ (ఎలక్ట్రికల్), టీ–ఎస్ గ్రేడ్ సి–24, ఫిట్టర్ ట్రైనీ, క్యాట్ 1–47,ఎలక్ట్రీషియన్ ట్రైనీ, క్యాట్ 1–98.
- » **అర్హత:** సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులవ్వాలి.
- » **వయసు:** గరిష్ట వయసు 30 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 15.04.2024
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**04.05.2024
- » **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://scclmines.com

ఇండియన్ ఆర్మీలో టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సు

ఇండియన్ ఆర్మీ 140 టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సులో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలిటరీ అకాడెమీలో 2025లో ప్రారంభమయ్యే కోర్సులో ప్రవేశం కల్పిస్తారు. అవివాహిత పురుష అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులు.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 30 (140వ టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సు)
- » **కోర్ ఇంజనీరింగ్ స్ట్రీమ్:** సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ఇతర ఇంజనీరింగ్ స్ట్రీమ్స్.
- » **అర్హతలు:** సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు లేదా కోర్సు చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
- » **వయసు:** 01.01.2025 నాటికి 20–27 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **ఎంపిక విధానం:** అప్లికేషన్ల షార్ట్ లిస్టింగ్, స్టేజ్1, స్టేజ్ 2 టెస్టులు, ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ, మెడికల్ టెస్టుల ఆధారంగా ఎంపిక చేస్తారు. ఎంపికైన వారికి 12 నెలలపాటు డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలిటరీ అకాడెమీలో శిక్షణ ఉంటుంది. ఈ సమయంలో లెఫ్టినెంట్ ర్యాంకుతో షార్ట్ సర్వీస్ కమిషన్ లభిస్తుంది. శిక్షణ అనంతరం పర్మనెంట్ కమిషన్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- » **దరఖాస్తులకు చివరి తేది:** 09.05.2024
- » **వెబ్‌సైట్:** https://joinindianarmy.nic.in/Authentication.aspx

ఆర్థిక, గణాంక కొలువుల పిలుపు

» మొత్తం 48 పోస్టులతో ఐఈఎస్/ ఐఎస్ఎస్ నోటిఫికేషన్
» రాత పరీక్ష, ఇంటర్వ్యూల్లో ప్రతిభ ఆధారంగా ఎంపిక
» ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్‌లో పీజీ, డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు

కేంద్ర సర్వీసుల్లో ఉన్నత కొలువులు కోరుకునే యువతకు మరో చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది! యూపీఎస్సీ.. ఐఈఎస్, ఐఎస్ఎస్-2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా జూనియర్ టైమ్ స్కేల్‌తో.. పలు శాఖల్లో.. అసిస్టెంట్ డైరెక్టర్, రీసెర్చ్ ఆఫీసర్ హోదాలో కొలువుదీరొచ్చు!! ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్‌లో పీజీ, బ్యాచిలర్ డిగ్రీ అర్హతతో ఈ ఉన్నత స్థాయి పోస్టులకు పోటీ పడొచ్చు. ఈ నేపథ్యంలో ఐఈఎస్, ఐఎస్ఎస్ పోస్టుల వివరాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు..

ఐఈఎస్/ఐఎస్ఎస్

ఐఈఎస్.. ఇండియన్ ఎకనామిక్ సర్వీస్. ఐఎస్ఎస్..ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు శాఖల ఆర్థిక సంబంధ కార్యకలాపాల సమర్థ నిర్వహణకు అవసరమైన నిపుణుల ఎంపికకు యూపీఎస్సీ ప్రతిఏటా నిర్వహించే పరీక్ష.. ఐఈఎస్/ఐఎస్ఎస్.

మొత్తం 48 పోస్టులు

యూపీఎస్సీ తాజాగా విడుదల చేసిన ఐఈఎస్/ఐఎస్ఎస్–2024 నోటిఫికేషన్ ద్వారా రెండు విభాగాల్లో కలిపి మొత్తం 48 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. ఇండియన్ ఎకనామిక్ సర్వీస్‌లో 18 పోస్టులు, ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్‌లో 30 పోస్టులు ఉన్నాయి.

విద్యార్హత

- ▪ **ఐఈఎస్:** గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఎకనామిక్స్/అప్లైడ్ ఎకనామిక్స్/బిజినెస్ ఎకనామిక్స్/ఎకనోమెట్రిక్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఉండాలి.
- ▪ **ఐఎస్ఎస్:** గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి స్టాటిస్టిక్స్/మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్/అప్లైడ్ స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్టుగా డిగ్రీ లేదా ఈ సబ్జెక్టులు స్పెషలైజేషన్‌గా పీజీ ఉత్తీర్ణులవ్వాలి.
- ▪ **వయసు:** 2024, ఆగస్టు 1 నాటికి అభ్యర్థి వయసు 21–30 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు పదేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

రెండు దశల ఎంపిక ప్రక్రియ

ఐఈఎస్, ఐఎస్ఎస్ ఎంపిక ప్రక్రియ రెండు దశలుగా ఉంటుంది. మొదటి దశలో వేయి మార్కులకు రాత పరీక్ష ఉంటుంది. ఇందులో చూపిన ప్రతిభ ఆధారంగా రెండో దశలో ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

రాత పరీక్షలు వేర్వేరుగా

ఎంపిక ప్రక్రియలో తొలి దశ రాత పరీక్ష ఐఈఎస్, ఐఎస్ఎస్ అభ్యర్థులకు వేర్వేరుగా ఉంటుంది.

వెయి మార్కులకు ఐఈఎస్ రాత పరీక్ష

ఐఈఎస్ రాత పరీక్ష ఆరు పేపర్లలో మొత్తం 1,000 మార్కులకు జరుగుతుంది. అవి.. పేపర్–1 జనరల్ ఇంగ్లిష్ 100 మార్కులు, పేపర్–2 జనరల్ స్టడీస్ 100 మార్కులు, పేపర్–3 జనరల్ ఎకనామిక్స్–1, 200 మార్కులు; పేపర్–4 జనరల్ ఎకనామిక్స్–2, 200 మార్కులు; పేపర్–5 జనరల్ ఎకనామిక్స్–3, 200 మార్కులు; పేపర్–6 ఇండియన్ ఎకనామిక్స్ 200 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఐఈఎస్ పరీక్ష పేపర్లన్నీ పూర్తిగా డిస్క్రిప్టివ్ విధానంలోనే ఉంటాయి. ప్రతి పేపర్‌కు పరీక్ష సమయం మూడు గంటలు.

ఐఎస్ఎస్.. రాత పరీక్ష ఇలా

ఐఈఎస్‌తో పోల్చితే.. ఐఎస్ఎస్ రాత పరీక్ష కొంత భిన్నంగా ఉంటుంది. ఇందులో ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ ప్రశ్నలతో పేపర్లు ఉంటాయి. అవి..పేపర్–1 జనరల్ ఇంగ్లిష్–100 మార్కులు, పేపర్–2 జనరల్ స్టడీస్–100 మార్కులు, పేపర్–3 స్టాటిస్టిక్స్–1(ఆబ్జెక్టివ్), 200 మార్కులు; పేపర్–4 స్టాటిస్టిక్స్–2(ఆబ్జెక్టివ్), 200 మార్కులు; పేపర్–5 స్టాటిస్టిక్స్–3, 200 మార్కులు; పేపర్–6 స్టాటిస్టిక్స్–4, 200 మార్కులకు ఉంటాయి. మొత్తం 1000 మార్కులకు పరీక్ష ఉంటుంది. పేపర్ 3,4 తప్ప మిగతా పేపర్లు డిస్క్రిప్టివ్ విధానంలో ఉంటాయి. ఆబ్జెక్టివ్ పేపర్లకు రెండు గంటలు, డిస్క్రిప్టివ్ పేపర్లకు మూడు గంటల సమయం అందుబాటులో ఉంటుంది.

పర్సనల్ ఇంటర్వ్యూ

రాత పరీక్షలో చూపిన ప్రతిభ, పోస్టుల సంఖ్య, రిజర్వేషన్లు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని మెరిట్ లిస్ట్ రూపొందిస్తారు. ఇందులో చోటు సంపాదించిన వారికి మలిదశలో చివరగా 200 మార్కులకు పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇందులోనూ ప్రతిభ చూపితే.. రాత పరీక్షలో మార్కులు, ఇంటర్వ్యూ మార్కులను క్రోడీకరించి తుది విజేతలను ఖరారు చేసి ఆయా సర్వీసులకు ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- ▪ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- ▪ **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, ఏప్రిల్ 30
- ▪ **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ:** 2024, మే 1 నుంచి 7 వరకు
- ▪ **పరీక్ష తేదీలు:** 2024, జూన్ 21 నుంచి
- ▪ **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్
- ▪ **వెబ్‌సైట్:** www.upsc.gov.in

రాత పరీక్షలో రాణించేలా

ఐఈఎస్, ఐఎస్ఎస్ పరీక్షల్లో విజయం సాధించేందుకు అభ్యర్థులు అకడమిక్‌గా పీజీ స్థాయి పుస్తకాలను అధ్యయనం చేయడం ఉపకరిస్తుంది. అదే విధంగా ప్రీవియస్ పేపర్లు, మోడల్ పేపర్ల సాధన కూడా కలిసొస్తుంది.

జనరల్ ఇంగ్లిష్

ఐఈఎస్, ఐఎస్ఎస్ రెండు సర్వీసులకు ఉమ్మడిగా ఉండే పేపర్ ఇది. ఇందులో ప్రశ్నల క్లిష్టత బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలో ఉంటుంది. ఇందులో ఒక ఎస్సే రాయాల్సి ఉంటుంది. వొకాబ్యులరీని, రీడింగ్ కాంప్రహెన్షన్ టెక్నిక్స్‌ను పెంచుకోవాలి. ఇంగ్లిష్‌లో ఎక్కువగా ప్యాసేజ్ రైటింగ్, ప్రెసిస్ రైటింగ్ ప్రాక్టీస్ చేయాలి.

జనరల్ స్టడీస్

ఈ పేపర్ కూడా రెండు సర్వీసులకు ఒకే మాదిరిగా ఉంటుంది. ఎక్కువగా కరెంట్ ఈవెంట్స్, జనరల్ నాలెడ్జ్ నుంచి ప్రశ్నలు అడిగే అవకాశముంది. శాస్త్ర సాంకేతిక రంగం, భారత రాజ్యాంగం, భారత దేశ చరిత్ర, జాగ్రఫీలపై పట్టు సాధించాలి.

జనరల్ ఎకనామిక్స్-1

ఇందులో రాణించడానికి సూక్ష్మ అర్థశాస్త్రం, మ్యాథమెటిక్స్, స్టాటిస్టికల్ ఎకనోమెట్రిక్ మెథడ్స్‌పై పట్టు సాధించాలి. సూక్ష్మ అర్థశాస్త్రానికి సంబంధించి వినియోగదారుని డిమాండ్ సిద్ధాంతం, ఉత్పత్తి సిద్ధాంతం, విలువ, పంపిణీ అంశాలు తెలుసుకోవాలి. అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో ఉండే ఈ పేపర్ కోసం లారెంజ్ వక్ర రేఖ, ఏంజెల్ సూత్రం, పారెటో పంపిణీ సిద్ధాంతం, స్వల్పకాల-దీర్ఘకాల వ్యయ రేఖలు, తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

జనరల్ ఎకనామిక్స్-2

స్థూల అర్థశాస్త్రం, ఎకనామిక్స్ ఆఫ్ డెవలప్‌మెంట్ అండ్ ప్లానింగ్, అంతర్జాతీయ అర్థశాస్త్రం తదితర అంశాల కలయికగా ఉండే పేపర్ ఇది. దీనికోసం ప్రతి అంశాన్ని వర్తమాన పరిస్థితులకు అన్వయిస్తూ చదువుకోవాలి. జాతీయాదాయం కొలమానం, గ్రీన్ నేషనల్ ఇన్‌కమ్, సంప్రదాయ ఉద్యోగితా సిద్ధాంతం, ఫిలిప్స్ రేఖ, ద్రవ్యరాశి సిద్ధాంతం వంటి కీలక అంశాలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా ప్రపంచ వాణిజ్య సంక్షోభాలు–కారణాలు,ప్రపంచ వాణిజ్య సంస్థ, ఐఎంఎఫ్ వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థల తాజా కార్యకలాపాలపైనా దృష్టి పెట్టాలి.

జనరల్ ఎకనామిక్స్-3

ఇందులో ప్రభుత్వ విత్త శాస్త్రం, పర్యావరణ అర్థశాస్త్రం, ఇండస్ట్రియల్ ఎకనమిక్స్ అంశాలు సమ్మిళితంగా ఉంటాయి. ఈ పేపర్‌లో మంచి మార్కుల కోసం పన్ను సంస్కరణలు, గరిష్ట సాంఘిక ప్రయోజన సిద్ధాంతం, ప్రభుత్వ వ్యయ సిద్ధాంతం, గ్రీన్ జీడీపీ, ఇండస్ట్రియల్ ఎకనమిక్స్ తదితర అంశాలపై అవగాహన పొందాలి.



ఐఈఎస్, ఐఎస్ఎస్-2024

ఇండియన్ ఎకనామిక్స్

సిలబస్‌లోని ముఖ్యాంశాలను వర్తమాన పరిస్థితులకు అన్వయిస్తూ ప్రిపరేషన్ సాగించాలి. స్థిరీకరణ–నిర్మాణాత్మక సర్దుబాటు ప్యాకేజీ, విత్తరంగ సంస్కరణలు, నీతి ఆయోగ్ సిఫార్సులు, టోకు ధరల సూచీ –రిటైల్ ధరల సూచీ, భారత ద్రవ్య మార్కెట్, ఎఫ్‌డీఐ, డిజిన్వెస్ట్‌మెంట్ పాలసీ తదితర తాజా అంశాలపై దృష్టి సారించాలి.

సబ్జెక్ట్ పేపర్లకు సన్నద్ధత ఇలా

- ▪ స్టాటిస్టిక్స్–1 పేపర్‌లో రాణించాలంటే.. పలు సిద్ధాంతాలపై పట్టు సాధించాలి. స్టాటిస్టికల్ మెథడ్స్, న్యూమరికల్ అనాలిసిస్ వంటి అంశాలపై అవగాహన పొందాలి.
- ▪ స్టాటిస్టిక్స్–2 పేపర్‌లో.. లీనియర్ మోడల్స్, ఎస్టిమేషన్, హైపోథిసిస్ టెస్టింగ్, మల్టీవెరైటీ అనాలిసిస్(ఎస్టిమేషన్ ఆఫ్ మీన్ వెక్టార్ అండ్ కో వేరియన్స్ మ్యాట్రిక్స్ తదితర అంశాలపై దృష్టిసారించాలి.
- ▪ స్టాటిస్టిక్స్–3 పేపర్‌లో.. శాంప్లింగ్ టెక్నిక్స్, ఎకనామిక్ సాటిస్టిక్స్, డిజైన్ అండ్ అనాలిసిస్ ఆఫ్ ఎక్స్‌పెరిమెంట్స్, ఎకనోమెట్రిక్స్ అంశాలపై అవగాహన పెంచుకోవాలి.
- ▪ స్టాటిస్టిక్స్–4 పేపర్‌లో.. స్టాటిస్టికల్ క్వాలిటీ కంట్రోల్ అండ్ ఆపరేషన్స్ రీసెర్చ్ ,డెమోగ్రఫీ అండ్ వైటల్ ఛార్ట్స్, కంప్యూటర్ సిస్టమ్–సాఫ్ట్‌వేర్ కాన్సెప్ట్స్, డేటాబేస్ మేనేజ్‌మెంట్ వంటి కంప్యూటర్ సంబంధ అంశాలపై పట్టుసాధించాలి.
- ▪ డేటా ఆధారిత అంశాలు అధికంగా ఉండే స్టాటిస్టిక్స్ సబ్జెక్ట్ పేపర్లలో మంచి స్కోర్ చేయాలంటే.. వేగంతోపాటు కచ్చితత్వం, సునిశిత పరిశీలన అవసరం. ప్రిపరేషన్ సమయంలోనే ప్రతి అంశాన్ని నిర్దిష్ట కాలపరిమితి విధించుకుని చదవాలి. ముఖ్యంగా ఆయా సిద్ధాంతాలు, వాటిని వినియోగించి డేటా రూపకల్పన, ఛార్ట్స్, గ్రాఫ్స్ రూపకల్పన వంటి అంశాలపై పట్టు సాధించాలి.